భారత్-మలేషియా విద్యా సంబంధాలు

మెరుగుపరిచేలా చర్యలు



సనత్‌నగర్: భారత్–మలేషియా దేశాల మధ్య విద్యా సంబంధాలను మరింత మెరుగుపరిచే దిశగా తీసుకుంటున్న చర్యలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సౌత్ ఇండియా కాన్సుల్ జనరల్ ఆఫ్ మలేషియా శరవణకుమార్ సూచించారు. ఎడ్యుకేషన్ మలేషియా గ్లోబల్ సర్వీసెస్ (ఈఎంజీఎస్) ఆధ్వర్యంలో శనివారం బేగంపేటలోని తాజ్‌వివంతా హోటల్‌లో 'స్టడీ మలేషియా ఎడ్యుకేషన్ ఫెయిర్'ను నిర్వహించారు. ఈ సందర్భంగా శరవణ కుమార్ మాట్లాడుతూ.. అంతర్జాతీయంగా విద్యార్థులకు మలేషియాలో అండర్ గ్రాడ్యుయేట్ నుంచి పోస్ట్ గ్రాడ్యుయేట్ వరకు వివిధ ప్రోగ్రామ్‌లను అందించడం జరుగుతుందన్నారు. మలేషియా విశ్వ విద్యాలయాలు మొబిలిటీ, ఎక్స్చేంజ్ ప్రోగ్రామ్‌లు, ట్విన్నింగ్ ప్రోగ్రామ్‌లను కూడా అందిస్తాయన్నారు. కాగా మలేషియాకు చెందిన ఎనిమిది టాప్ యూనివర్సిటీల ప్రతినిధులు హాజరై విద్యార్థులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. మలేషియాలో అందుబాటులో ఉన్న స్కాలర్‌షిప్‌లు, కెరీర్ అవకాశాలను విద్యార్థులు అడిగి తెలుసుకున్నారు. పలువురు విద్యార్థులకు అక్కడికక్కడే ఆఫర్ లెటర్లను పొందారు.

'రన్ ఫర్ జీసస్'ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న దేవప్రియం పుల్లా

రాంగోపాల్‌పేట్: ఈస్టర్ పండుగ సందర్భంగా నిర్వహించే రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని మార్చి 30వ తేదీన నిర్వహిస్తున్నట్లు క్రిష్టియన్ ఫోరం ఫౌండర్ బ్రదర్ దేవప్రియం పుల్లా అన్నారు. శనివారం ఈడెన్ స్క్వేర్ బిల్డింగ్‌లో నిర్వహించిన రన్ ఫర్ జీసస్ సన్నాహక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈస్టర్ శుభ సందేశాన్ని నగరంలోని ప్రజలందరికి తెలిపేందుకు ప్రతి ఏడాది రన్ ఫర్ జీసస్ పేరుతో ర్యాలీని నిర్వహించి క్రైస్తవుల ఐక్యత చాటుతున్నామన్నారు .ర్యాలీ అనంతరం ఎల్బీస్టేడియంలో జరిగే ప్రార్థన సభకు అన్ని క్రైస్తవ సంఘాలు, డినామినేషన్స్ మత పెద్దలు, బిషప్‌తో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు ప్రముఖులు పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ పరిధిలోని రన్‌ఫర్ జీసస్ కో ఆర్డినేటర్లు క్రిష్టియన్ ఎన్‌జీవో నెట్‌వర్క్ అధ్యక్షులు డాక్టర్ ఎడ్వర్డ్ శామ్యుల్, పాస్టర్ అంతయ్య, మెన్నో జోయల్, గోడి శేఖర్, పిలిఫ్, ఇజ్రాయేల్, అనిల్ జాబేజ్, జాన్ పాల్, జెరుసలేం మత్తయ్య పాల్గొన్నారు.

ప్రారంభానికి నాలుగేళ్లు..

పూర్తికి ఇంకెన్నాళ్లో?

- దశాబ్దంన్నర కాలంగా లాలాపేట వాసులను ఊరిస్తున్న స్విమ్మింగ్ పూల్
- నత్తనడకన నిర్మాణ పనులు
- పట్టించుకోని అధికారులు



నత్తనడకన కొనసాగుతున్న స్విమ్మింగ్ పూల్ నిర్మాణ పనులు

లాలాపేట: లాలాపేట ప్రాంతవాసులకు ప్రతి వేసవిలో స్విమ్మింగ్ పూల్ అంశం ఊరిస్తూనే ఉంది. ఈ వేసవిలో చల్లని నీటిలో ఈత కొడుతూ సేద తీరాలనే లాలాపేట వాసుల కళ కల్లగానే మిగులుతోంది. గత 2007 ఫిబ్రవరి 10న అప్పటి మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ హైదరాబాద్(ఎంసీహెచ్) మేయర్ తీగల కృష్ణారెడ్డి, అప్పటి, ప్రస్తుత ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ ఆధ్వర్యంలో లాలాపేట మున్సిపల్ మైదానంలో స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి శిలాఫలకం వేశారు. దీంతో ఇక లాలాపేట ప్రజలకు స్విమ్మింగ్ పూల్ అందుబాటులోకి రానుందని నేతలు చెప్పిన మాటలకు చేతలకు ఏమాత్రం పొంతన లేకుండాపోయింది. దశాబ్ద కాలం తర్వాత ఎట్టకేలకు మళ్లీ ప్రస్తుత ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ ఆధ్వర్యంలో నాలుగేళ్ల క్రితం ప్రొఫెసర్ జయశంకర్ స్టేడియం ఆవరణలో జాతీయ స్థాయి ప్రమాణాలతో స్విమ్మింగ్ పూల్ పనులు చేపట్టారు. మెయిన్ స్విమ్మింగ్ పూల్ ఇప్పటి వరకు కేవలం సగం పనులు మాత్రమే అయ్యాయి. ఇంకా కిడ్స్ కోసం ఏర్పాటు చేయాల్సిన పూల్ పనులను చేపట్టలేదు. ప్రస్తుతం టాయిలెట్లు, వాటర్ ఫిల్టర్ కోసం గదుల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.

దాదాపు రూ. 6 కోట్ల వ్యయంతో..

తార్నాక మున్సిపల్ డివిజన్ పరిధి లాలాపేటలోని ప్రొ. జయశంకర్ స్టేడియం ఆవరణలో దాదాపు రూ. 6 కోట్ల వ్యయంతో జాతీయ స్థాయి ప్రమాణాలతో స్విమ్మింగ్ పూల్ నిర్మాణం చేస్తున్నారు. మొత్తం 2275 స్క్వేర్ మీటర్లు ఉండగా మెయిన్ పూల్ ఏరియా



1050 స్క్వేర్ మీటర్లు, 50 మీటర్ల పొడవు, 21 మీటర్ల వెడల్పు, 2 మీటర్ల లోతుతో నిర్మిస్తున్నారు. కిడ్స్ పూల్ ఏరియా 40 స్క్వేర్ మీటర్లు, 5 మీటర్ల పొడవు 8 మీటర్ల వెడల్పు. దీంతో పాటు చెయింజింగ్, టాయిలెట్ రూమ్‌లు, వెయిటింగ్ లాబీ, పార్కింగ్ ఏరియా, ఈ స్విమ్మింగ్ పూల్ అందుబాటులోకి వస్తే ఇక్కడ అథ్లెటిక్స్, జాతీయ స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించేందుకు అనుకూలంగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

హామీలతో ఊరించారు..

తార్నాక డివిజన్ లాలాపేట ప్రజలకు జాతీయ స్థాయి ప్రమాణాలతో అత్యాధునికమైన సౌకర్యాలతో స్విమ్మింగ్ పూల్‌ను నిర్మిస్తున్నామంటూ ప్రజా ప్రతినిధులు, అధికారులు గొప్పగా చెప్పారు. గత మూడేళ్ల క్రితం జరిగిన జీహెచ్‌ఎంసీ ఎన్నికలు, గతేడాది డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రెండు పర్యాయాలు బీఆర్ఎస్ నాయకులు స్విమ్మింగ్ పూల్‌ను ప్రచారాస్త్రంగా వాడుకున్నారు. కానీ స్విమ్మింగ్ పూల్ నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేయించడంలో మాత్రం నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని లాలాపేట వాసులు ఆగ్రహంగా ఉన్నారు. ఇదే అదనుగా భావించి సదరు కాంట్రాక్టర్ పనులను ఇష్టానుసారంగా కొనసాగిస్తున్నాడు. డిసెంబర్ లో జరిగిన ఎన్నికల ముందు త్వరలో స్విమ్మింగ్‌పూల్ అందుబాటులోకి వస్తుందని పెద్ద ఎత్తున ప్రచారం, ఆర్భాటం చేశారు. తీరా చూస్తే ఎన్నికలు ముగిసాయి. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. ఎండిపోయి గుంతను తలపిస్తోంది. ఈ విషయమై సదరు గుత్తేదారును అడిగితే పని చేసిన దానికి సకాలంలో బిల్లులు చెల్లించడం లేదు. ఇప్పటికే చాలా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. బిల్లులు సక్రమంగా చెల్లిస్తే వచ్చే ఆరు నెలల్లో స్విమ్మింగ్ పూల్ నిర్మాణ పనులు పూర్తి చేయవచ్చని బిల్లులు రాకపోవడంతోనే పనుల్లో జాప్యం జరుగుతుందని చెప్పకొచ్చాడు. ఉన్నతాధికారులు స్పందించి స్విమ్మింగ్ పూల్ పనులు పర్తయ్యేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

'ఓయూలో కోట్ల రూపాయల దారి మళ్లింపు'

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో కోట్లాది రూపాయాలను మళ్లిస్తున్నారని ఏఐఎస్‌ఎఫ్ కార్యదర్శి, పీహెచ్‌డీ విద్యార్థి నెల్లి సత్య ఆరోపించారు. విద్యార్థులపై అధిక ఫీజుల భారాన్ని మోపి వచ్చిన నిధులను ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారన్నారు. ఆర్టీఐ ద్వారా దుర్వినియోగం అయిన నిధుల వివరాలను సేకరించినట్లు పేర్కొన్నారు. ఓయూకు ప్రధానంగా ఎగ్జామినేషన్ బ్రాంచ్, దూరవిద్య కేంద్రం, పీజీ అడ్మిషన్స్ డైరెక్టరేట్ లభించే కోట్లాది రూపాయల నిధుల ఇష్టారాజ్యాంగా దారి మళ్లిస్తున్నారని పేర్కొన్నారు. ఎగ్జామినేషన్ బ్రాంచ్ నుంచి రూ.30 కోట్ల నిధులను భవన నిర్మాణాలకు, దూరవిద్య నుంచి రూ.3 కోట్లను ఆర్ట్స్ కాలేజీ భవనం మరమ్మతులకు, ఇతర కార్యాలయాల నుంచి బైపాస్ రోడ్డు రూ.16 కోట్లను వాడుకున్నారని ఆరోపించారు. బైపాస్ రోడ్డు, పాలన భవనం, హాస్టల్ భవనాలకు గత ప్రభుత్వం రూ.144 కోట్లు విడుదల చేసిందని చెప్పి ఒక్క రూపాయి కూడా ఇవ్వక పోవడంతో విద్యార్థుల నుంచి ఫీజుల రూపంలో వసూలు చేసిన అంతర్గత నిధులను కేటాయించడం వర్సిటీ నిబంధనలకు విరుద్ధమన్నారు. గతేడాది ఓయూలో జరిగిన సీనియర్ ప్రొఫెసర్ల పదోన్నతుల్లో జరిగిన అవినీతి, అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ చేపట్టి అక్రమంగా పదోన్నతులు ప్రొఫెసర్లను గుర్తించి వైస్ చాన్సలర్ పదవులకు అనర్హులుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ఉచిత వైద్యశిబిరం అభినందనీయం



వైద్య పరీక్షలకు వచ్చిన వారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని

రాంగోపాల్‌పేట్: ఉచిత వైద్య శిబిరాలతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ప్రింటింగ్ మిషన్ ఆవిష్కర్త గూటన్‌బర్గ్ జయంతి సందర్భంగా శనివారం కళాసీగూడలో మక్తల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదలు అధికంగా నివసించే బస్తీల్లో ఇలాంటి శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు అత్తెల్లి అరుణగౌడ్, మల్లికార్జున్‌గౌడ్, మక్తల ఫౌండేషన్ అధ్యక్షులు జలంధర్‌గౌడ్, శేఖర్‌గౌడ్, వేణు, శివ, వెంకటేష్, ప్రకాష్ పాల్గొన్నారు.

ఘనంగా సంత్ రవిదాస్ జయంతి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో గురు సంత్ రవిదాస్ 647వ జయంతిని విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. శనివారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన సంత్ రవిదాస్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. దేశంలో బుద్ధుడి తర్వాత సామాజిక అసమానతలపై భక్తి ఉద్యమాలు చేశారని విద్యార్థి నేత తాళ్ల అజయ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నరేందర్, పల్లెర్ల సుధాకర్, వలిగొండ నర్సింహా, సుమంత్, వంశీధర్ పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధికి కృషి



ఆదయ్యనగర్‌లో స్థానికులతో మాట్లాడుతున్న కొంతం దీపికా

బన్సీలాల్‌పేట్: సమస్యల పరిష్కారం.. డివిజన్ సమగ్రాభివృద్ధికి నిర్మాణాత్మకమైన కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నట్లు మోండా మార్కెట్ డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపికా అన్నారు. ఆదయ్యనగర్‌లో జలమండలి అధికారులతో కలిసి పర్యటిస్తూ స్థానికులతో మాట్లాడారు. డ్రైనేజీ సమస్యతో ఇబ్బంది పడతున్నామని ఈ సందర్భంగా పలువురు ఆమె దృష్టికి తీసుకురాగా నూతన డ్రైనేజీ పైపులైన్ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు. అనంతరం ఆదయ్యనగర్ ప్లేగ్రౌండ్‌లో కార్పొరేటర్ పర్యటించి ఇక్కడ ఓపెన్ జిమ్‌కు నిధులు మంజూరయ్యాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో కలిసి త్వరలో జిమ్ పనులు ప్రారంభిస్తామని వివరించారు. కార్పొరేటర్ వెంట జలమండలి మేనేజర్ సంధ్య, నవీన్, స్థానికులు వినయ్, సుభాష్, సత్యం, ప్రశాంత్, సాయికుమార్, నర్సింగ్ ఉన్నారు.

ఘనంగా స్వామివారి ఊరేగింపు

అడ్డగుట్ట: మార్కండేయ సహిత శివ పంచాయతన విగ్రహ, శిఖర, ధ్వజస్తంభ యంత్ర ప్రతిష్ట మహోత్సవాన్ని ఆలయ నిర్వాహకులు ఘనంగా ప్రారంభించారు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ ప్రతిష్ట మహోత్సవంలో మొదటి రోజైన శనివారం స్వామి వార్ల విగ్రహాల ఊరేగింపును కనుల పండవగా నిర్వహించారు. మంగళ వాయిద్యాలతో వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ నిర్వహించారు. అడ్డగుట్ట సీ–సెక్షన్‌లోని కమ్యూనిటీ హాల్ వెనుక ఉన్న గుట్టపై నిర్మించిన మార్కండేయ ఆలయానికి శ్రీ జయగిరి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ఉన్న విగ్రహాలతో పాటు, లింగం, స్వామి వార్ల విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ పద్మశాలీ సంఘం అధ్యక్షుడు కత్తుల సుదర్శన్, కల్లెపల్లి రాజు, దేవాలయ కమిటీ, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణనే మాదిగల రాజకీయ ఎజెండా



మాట్లాడుతున్న గోవిందు నరేష్

సనత్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల్లో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణనే మాదిగల రాజకీయ ఎజెండా అని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్ మాదిగ అన్నారు. బేగంపేట డివిజన్‌లోని పాటిగడ్డలో ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశం ఈరంగారి రాములు అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన గోవిందు నరేష్ మాదిగ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ సాధన కోసం మాదిగలు, ఉప కులాల ప్రజలు 30 ఏళ్లుగా పోరాటం చేస్తున్నారని ఈ పోరాటం అంతిమ దశకు చేరుకుందన్నారు. కొన్ని రాజకీయ పార్టీలు మాటల్లో ఎస్సీ వర్గీకరణను బలపరుస్తూ ఆచరణలో వ్యతిరేకంగా వ్యవహరించాయని అన్నారు. మాదిగల ఓట్లతో లబ్ధి పొంది మాలల సంక్షేమం కోసం పనిచేస్తున్నాయని మాదిగలను కేవలం ఓట్ల కోసమే వాడుకుంటున్న పార్టీలకు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. మాదిగలంతా రాజకీయంగా ఐకమత్యంతో ఉండాలని ఈ ఎన్నికల్లో ఎస్సీ వర్గీకరణ ఎజెండా మీదనే ఓట్లు వేసేలా తీర్మానాలు చేసుకోవాలన్నారు.

విద్యుత్ సమస్యలపై వెంటనే స్పందించాలి

పద్మారావునగర్: విద్యుత్ సమస్యలపై అధికారులు, సిబ్బంది వెంటనే స్పందించి పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని సికింద్రాబాద్ సర్కిల్ సూపరింటెండెంట్ (ఎస్‌ఈ) రవికుమార్ అన్నారు. పద్మారావునగర్‌లోని విద్యుత్ శాఖ డీఈ కార్యాలయం ఆవరణలో శనివారం జరిగిన అధికారులు, సిబ్బంది సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలు తప్పవన్నారు. రానున్న వేసవిలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. లోఓల్టేజీ విద్యుత్ ప్రాంతాలను గుర్తించి ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని, కొత్త లైన్లు వేయడానికి ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. ప్యారడైజ్ డివిజన్ పరిధిలో 5.20 లక్షల మంది వినియోగదారులు ఉన్నారని వారికి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా సరఫరా చేస్తున్నామన్నారు. డివిజన్ పరిధిలో 32 సబ్ స్టేషన్లు, 7860 ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయని వివరించారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కోరారు. డీఈ శ్రీధర్ మాట్లాడుతూ.. విద్యుత్ సమస్యల పరిష్కారానికి నిర్మాణాత్మకమైన కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో ఏడీఈలు మహేష్ కుమార్, శివ దుర్గాప్రసాద్, చంద్రశేఖర్, విజయ్‌కుమార్, సురేష్‌లతో పాటు సెక్షన్ ఏఈలు, లైన్‌మెన్‌లు పాల్గొన్నారు.

29న ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల సమావేశం



సమావేశంలో పాల్గొన్న నాయకులు

చిలకలగూడ: ఈ నెల 29వ తేదీన జరిగే హైదరాబాద్ జిల్లా ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల సమావేశం విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్‌నరేష్ మాదిగ, హైదరాబాద్ జిల్లా అధికార ప్రతినిధి డప్పు మల్లికార్జున మాదిగ కోరారు. బౌద్ధనగర్ డివిజన్ న్యూఅశోక్‌నగర్ కమ్యూనిటీ హాల్లో శనివారం జరిగిన సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎమ్మార్పీఎస్ అనుసరించే కార్యాచరణపై చర్చించి, పలు కీలక నిర్ణయాలు తీసుకుంటారని, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ హాజరయ్యే కార్యక్రమానికి మాదిగలంతా తరలివచ్చి జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాలకు చెందిన నాయకులు రాగటి సత్యంమాదిగ, నరసయ్య, నరేంద్రబాబు, లక్ష్మణ్, సోమశేఖర్, టీవీ నర్సింహా, శివప్రసాద్, దేవేందర్, శేఖర్, రాజు, శామ్యూల్, రఘువరన్, సత్యనారాయణ, రాజశేఖర్, రామకృష్ణ, శివ, మహేష్ పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



పద్మారావునగర్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి అన్నారు. పద్మారావునగర్ అభినవనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన బన్సీలాల్ పేట్ డివిజన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 26న పద్మారావునగర్ నుంచి ప్రారంభమయ్యే విజయసంకల్ప యాత్రను విజయవంతం చేయడానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ కోసం పని చేయని నాయకులకు బాధ్యతలు అప్పగించరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం కన్వీనర్ శ్రీశైలం గౌడ్, దళిత మోర్చా రాష్ట్ర కార్యదర్శి స్పందన, ఉమేష్ ఖండెల్వాల్, రాధిక దేశ్‌పాండే, నాయకులు హరినాథ్ నాయి, క్రిష్ణ, డి. లక్ష్మీ, గుంటి సత్యనారాయణ, కుర్మ శంకర్, శ్రీకాంత్, కళ్యాణ్, ఈశ్వర్ బాబు, కిరీటీ, నరేష్, పరమేష్, స్వామి, వంశీ, అండాలు, శ్రీకర్, కిషోర్ పాల్గొన్నారు.

నియామకం



గోవింద్‌నాయక్

సనత్‌నగర్: భారతీయ జనతా పార్టీ ఎస్టీ మోర్చా రాష్ట్ర కమిటీ స్పోక్స్ పర్సన్‌గా ఎస్ఆర్‌నగర్‌కు చెందిన ఖేతావత్ గోవింద్‌రాథోడ్ నియమితులయ్యారు. తనకు ఈ అవకాశం కల్పించినందుకు పార్టీ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు గోవింద్‌నాయక్ పేర్కొన్నారు .

ప్రొఫెసర్ల పదోన్నతులు సక్రమమే: రిజిస్ట్రార్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో గతేడాది జరిగిన సీనియర్ ప్రొఫెసర్ల పదోన్నతులు సక్రమమే అని రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ వివరించారు. శనివారం ఓయూ పాలన భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీనియర్ ప్రొఫెసర్ల పదోన్నతులు సక్రమంగా జరగలేదని కొన్ని దిన పత్రికల్లో (సాక్షికాదు) వచ్చిన కథనాల్లో వాస్తవం లేదన్నారు. జీవో నంబరు 15 అనుసరించి యూజీసీ నియమ నిబంధనలు పాటించి ప్రొఫెసర్లకు సీనియర్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పించినట్లు తెలిపారు. అక్రమాలు జరిగాయంటూ కొందరు రాద్ధాంతం చేయడం సరికాదన్నారు. పదోన్నతుల పై సందేహాలు ఉంటే అధికారులను సంప్రదించాలన్నారు.

ఎమ్మెల్యే లాస్యనందిత మృతి బాధాకరం

చిలకలగూడ : సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత అకాల మరణం బాధాకరమని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ అన్నారు. లాస్యనందిత కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించారు. లాస్య నందిత కార్పొరేటర్‌గా ఉన్నప్పటి నుంచి తనకు అత్యంత సన్నిహితురాలని, ఆమె లేని లోటు తీర్చలేనిదని అన్నారు. ఆమెతో తనకుగల సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు.

అబ్బురపరిచిన సామూహిక కీ బోర్డు ప్లేయింగ్

లాలాపేట: విజయవాడకు చెందిన యషువా బెత్ హల్లెల్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో శనివారం సికింద్రాబాద్ పరిధి తార్నాకలోని సెయింట్ థామస్ చర్చిలో నిర్వహించిన సామూహిక కీ బోర్డు ప్లేయింగ్ కార్యక్రమం అబ్బురపరిచింది. ఒకే వేదికపై 291 మంది విద్యార్థులు గంట పాటు ఏకధాటిగా పాటలు పాడుతూ ఎలక్ట్రానిక్ కీ బోర్డులను వాయించారు. దీనికి ఏషియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు డాక్టర్ వసుధ అశోక్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించి విద్యార్థుల ప్రతిభను మెచ్చుకుని ఏషియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేరు నమోదు చేశారు. దీంతో పాటు బెత్ హల్లెల్ మ్యూజిక్ స్కూల్ వ్యవస్థాపకులు ఆగస్టీన్ దండిగికి ఏషియా బుక్ రికార్డ్స్ పురస్కారాన్ని అందజేశారు. మ్యూజిక్ స్కూల్ ప్రిన్సిపాల్ హెప్సిబా గ్రేస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో షైనీ, హవిలా, శ్రీకాంత్ దేవ్, ఎజ్రా శాస్త్రి, దుష్యంత్, జాన్ విలియమ్స్, దెబోరా, కళ్యాణి, సునీల్ పాల్గొన్నారు.

అవార్డులతో బాధ్యతలు రెట్టింపు



సనత్‌నగర్: బేగంపేట కంట్రీక్లబ్‌లో 'తెలంగాణ బిగ్గెస్ట్ బ్రాండ్ అవార్డ్స్'–2024 కార్యక్రమం శనివారం ఉత్సాహంగా జరిగింది. గ్లోబల్ పినాకిల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ రంగాలకు చెందిన నిపుణులను గుర్తించి అవార్డులను అందజేశారు. మాజీ ఎమ్మెల్యే సముద్రాల వేణుగోపాలచారి, విశ్రాంత ఐఏఎస్, విద్యావేత్త లక్ష్మీకాంతం, సినీనటుడు భానుచందర్, ఇండియన్ రోలర్ స్కేటర్ అనూప్ యమా పాల్గొని మాట్లాడారు. తమకు వద్దకు వచ్చేవారికి నాణ్యమైన సేవలు అందించేందుకు అవార్డు గ్రహీతలు కృషి చేయాలన్నారు. అవార్డులు బాధ్యతలను మరింతా పెంచుతాయని ఏ రంగంలో ఉన్నా మానవతా విలువలను పాటించాలని అప్పుడే ఆ వ్యక్తి, సంస్థకూ ప్రత్యేక గుర్తింపు లభిస్తోందన్నారు.

స్పెషల్ డ్రైవ్‌లో 25 బైకులు స్వాధీనం

రాంగోపాల్‌పేట్: నెక్లెస్ రోడ్‌లోని జలవిహార్ ప్రాంతంలో శనివారం నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో నంబర్ ప్లేట్లు లేని, ట్యాంపరింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు, ట్రిబుల్ రైడింగ్ చేస్తున్న 25 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ హెచ్చరించారు.

టెక్సాస్ ప్లెయిన్‌వ్యూ యూనివర్సిటీలో స్పాట్ అడ్మిషన్లు

అమీర్‌పేట: అమెరికాలోని వేలాండ్ బాప్టిస్ట్ యూనివర్సిటీలో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్లు కల్పిస్తున్నట్లు యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ బాబీ హాల్ తెలిపారు. అమీర్‌పేట హోటల్ ఆదిత్యపార్క్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. నగరంలోని యూనివర్సిటీ హబ్ భాగస్వామ్యంలో టెక్సాస్‌లోని ప్లెయిన్‌వ్యూ వర్సిటీలో బిజినెస్, ఐటీ వంటి కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఫిబ్రవరి 28న అమీర్‌పేట ఆదిత్య పార్క్ హోటల్‌లో స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ ఉంటుందని మరిన్ని వివరాలకు 6387149133 నంబర్‌లో సంప్రదించాలన్నారు. అనంతరం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఎన్‌రోల్‌మెంట్ మేనేజ్‌మెంట్ వైస్ ప్రెసిడెంట్ డేనియల్ బ్రౌన్, డాన్ యష్లే, సిండీమార్లో మెక్‌లెన్‌గాన్, యూనివర్సిటీ హబ్ వ్యవస్థాపకులు డాక్టర్ అనిల్ పల్లా పాల్గొన్నారు.

క్రైస్తవులపై దాడులను అరికట్టాలి

కంటోన్మెంట్: ఇటీవల క్రైస్తవులపై దాడులు పెరిగిపోతున్నాయని వెంటనే ప్రభుత్వం వీటిని అరికట్టాలని ఆల్ ఇండియా క్రిష్టియన్ ఫెలోషిప్ తెలంగాణ ప్రతినిధులు డిమాండ్ చేశారు. శనివారం సిఖ్‌విలేజ్‌లోని బిషప్స్ హౌస్‌లో తెలంగాణ రాష్ట్ర ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడిగా టీడీఎస్ మణి, ప్రధాన కార్యదర్శిగా వనిత అలెగ్జాండర్, కోశాధికారిగా బిషప్ ఏసుదాను, సంయుక్త కార్యదర్శిగా రెవరెండ్ సదానందం, కార్య నిర్వాహక కార్యదర్శిగా ప్రదీప్‌కుమార్, రామ్‌నాథ్‌తో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం దళిత క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తించే బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదింపజేయాలన్నారు.



నూతన కమిటీ సభ్యులు

విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలి



వివరాలువ వెల్లడిస్తున్న శ్యాంసుందర్ గౌడ్, తదితరులు

బన్సీలాల్‌పేట్: సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం పద్మారావునగర్‌లో ఈ నెల 26 సోమవారం ప్రారంభమయ్యే విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం పద్మారావునగర్ కౌతాకామకోటి కళ్యాణ మండపం ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్యాంసుందర్ గౌడ్, రాజశేఖరరెడ్డి, చంద్రశేఖర్, సారంగపాణి, పెద్ది రవీందర్, శ్రీశైలం గౌడ్, ఎస్. రాజు, స్పందన, ఉమేష్ ఖండెల్వాల్, హరినాథ్ పాల్గొని మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో అత్యధిక పార్లమెంట్ సీట్లు గెలిపే లక్ష్యంగా ఈ విజయ సంకల్పయాత్ర చేపడుతున్నట్లు వివరించారు.కేంద్రంలో మళ్లీ బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కానుందని ధీమా వ్యక్తం చేశారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

చిలకలగూడ: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చిలకలగూడ ఠాణా పరిధిలో జరిగింది. ఎస్ఐ సవిత వివరాల ప్రకారం.. సీతాఫల్‌మండి డివిజన్ మేడిబావి ఇందిరా నగర్‌కాలనీకి చెందిన మహేష్ (33) ఆటోడ్రైవర్. తల్లి అండాల్ సికింద్రాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఆయాగా పని చేస్తుంది. మహేష్ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 23న రాత్రి తల్లి అండాల్ విధులకు వెళ్లగా, మహేష్ ఒక్కటే ఇంట్లో ఉన్నాడు. శనివారం ఉదయం ఆమె వచ్చి తలుపు తట్టినా తీయలేదు. కిటికీ నుంచి చూడగా సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించాడు. స్థానికుల సహాయంతో తలుపులు బద్దలుకొట్టి కిందికి దించగా అప్పటికే మృతి చెందాడు.

అలరించిన ఫ్యాషన్ షో

రసూల్‌పురా: సికింద్రాబాద్ కంటోన్మెంట్ క్లాసిక్ గార్డెన్‌లో శనివారం జరిగిన వరల్డ్ ఇంటర్నేషనల్ ఇండియా బ్యూటీ పెజంట్ ఫ్యాషన్ షో ఇండియన్ జెమ్ అచీవర్ అవార్డ్స్ కార్యక్రమం అలరించింది. వివిధ రాష్ట్రాలకు చెందిన 40 మంది మోడల్స్ ర్యాంప్‌పై వాక్‌తో అదరగొట్టారు.ఈ కార్యక్రమంలో నటి జయశ్రీ ఎస్. రాజ్, ఫ్యాషన్ కొరియోగ్రాఫర్ మోనికా, షాలిజా సూరి చీఫ్ ఆర్గనైజర్ డా.యశ్‌రాము పాల్గొన్నారు.



రాజరాజేశ్వరీదేవికి పసుపు కొమ్ముల పూజ

రాంగోపాల్‌పేట్: మాఘమాసంలో వచ్చే శుద్ధ పౌర్ణమి సందర్భంగా కుమ్మరిగూడలోని రాజరాజేశ్వరీ అమ్మవారికి లక్ష పసుపు కొమ్ములతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీచక్రంపై కొలువుదీరిన అమ్మవారితో పాటు గర్భగుడిని కూడా పసుపు కొమ్ములతో ముస్తాబు చేశారు. అమ్మవారిని పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలతో పాటు లలితా సహస్రనామ పారాయణ చేశారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

ఈ పూజల్లో దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు వీరలక్ష్మి, ఎస్ఎస్ కుమారి, జీ ప్రభావతి, రాజరాజేశ్వరీ లలితా పారాయణ సత్సంగ్ అధ్యక్షురాలు బొగ్గారపు విజయలక్ష్మి, ప్రధాన కార్యదర్శి రాజేశ్వరి, కోశాధికారి అన్నపూర్ణ పాల్గొన్నారు.

రాష్ట్రపతి నిలయంలో సైన్స్ డే వేడుకలు

రసూల్‌పురా: జాతీయ విజ్ఞాన దినోత్సవం పురస్కరించుకుని రేపటి నుంచి మూడు రోజుల పాటు బొల్లారం రాష్ట్రపతి నిలయంలో సైన్స్ డే వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి నిలయం పరిపాలనాధికారి రజని ప్రియా మాట్లాడుతూ.. శాస్త్రీయ పరిశోధన, అభివృద్ధి సంస్థలైన ఎన్‌ఆర్‌ఎస్‌సీ, ఎన్‌జీఆర్ఐ, సీసీఎంబీ, ఎన్ఎస్ఐటీ, ఐఐటీ హెచ్ ద్వారా స్టాల్ ఏర్పాటు చేసి వారి సాంకేతికతను ప్రదర్శిస్తారన్నారు. 26న మొదటి రోజు సైన్స్ టెక్నాలజీలో తాజా పోకడలు అంశంపై క్విజ్ కాంపిటీషన్స్, 27న వివిధ పాఠశాల, కళాశాలల విద్యార్థులు సైన్స్ ఎగ్జిబిట్స్ ప్రదర్శన ఉంటుందన్నారు.